

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న - ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్

రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఓటర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను చుట్టబండలుగా మారుస్తుందని, ఎన్నికల్లో గెలిచే దమ్ము లేక కేంద్ర ఎన్నికల సంఘాన్ని తొత్తుగా మార్చుకుందని, ఓటరు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఎన్నికల సంఘం దాదాపుగా 65 లక్షల ఓటర్లకు ఓటు హక్కు లేకుండా చేయడం దేశ చరిత్రలో హీనాతిహీనంగా మిగిలిపోయిన సంఘటన అని అన్నారు. రాజ్యాంగం కల్పించిన.. దేశంలోని ప్రజలందరికీ 'ఒకే ఓటు ఒకే విలువ' అనే నినాదాన్ని నీరుగారిచే విధంగా బిజెపి వ్యవహరిస్తుందని విమర్శించారు. అణగారిన వర్గాలు, నిరక్షరాస్యులు, పేదలకు ఓటుహక్కును తొలగించే కుట్రలో భాగంగానే గుర్తింపు కార్డులో ఆధార్ కార్డు తొలగించాలని, ఆస్తి పత్రాలు, చదువుకున్న సర్టిఫికెట్లు, బర్త్ సర్టిఫికెట్లు అడగడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థను దశాబ్దాల వెనక్కు నెట్టి వేసే విధంగా ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు చేసినా బీహార్ ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం కోసం సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో మతం పేరుతో అలజడులు, ఘర్షణలు సృష్టించి తమ కుర్చీని కాపాడుకోవాలని చూస్తున్నారని, ఈ ఆటలు ఎంతో కాలం సాగవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మెన్ బర్రె జహంగీర్, ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్, ఎంఎ ఇగ్బాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఒబ్బు రామకృష్ణ, మైనార్టీ నాయకులు షేక్‌మీరా ఇక్బాల్‌చౌదరి, ప్రముఖ పాత్రికేయులు షేక్ హమీద్ పాషా, బిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యాదయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, సిఐటియు నాయకులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, దయ్యాల నర్సింహ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు ఆవాజ్ నాయకులు పాల్గొన్నారు.

బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలుపై కసరత్తు షురూ

- న్యాయ నిపుణుల సలహాకు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనేదానిపై మంత్రుల కమిటీ కసరత్తు ప్రారంభించింది. రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా తలెత్తనున్న అంశాలపై ఢిల్లీలోని ప్రముఖ న్యాయ నిపుణుల సలహాలను తీసుకోవాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రుల కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఎలాంటి న్యాయపరమైన వివాదాలు ఏర్పడకుండా సలహా ఇవ్వాల్సిందిగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని కోరారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాంశాలపై కులగణన నిర్వహించిన సంగతి తెలిసిందే. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అసెంబ్లీ ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఆ వాగ్దానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఒబిసి కులగణనను చేపట్టినట్లు మంత్రుల కమిటీ తెలిపింది. కులగణనన పూర్తయిన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని నిర్ణయించింది. ఆ బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టి ఆమోదం తీసుకుంది. ఆ తర్వాత ఆ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపింది. ఆ బిల్లు గవర్నర్ నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్ళింది. ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఐదు నెలలుగా బిల్లు పెండింగ్‌లో ఉన్నది. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని తేల్చేందుకు మంత్రుల కమిటీని ప్రకటించిన విషయం తెలిసిందే. సమావేశంలో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి తన అభిప్రాయాన్ని తెలిపారు.

చెరువులో నవజాత శిశువు మృతదేహం

- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు నెలలు కూడా నిండని ఓ పసికందును గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో పడేసిన విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామంలోని ఫతేసాగర్ చెరువులో ఆదివారం జరిగింది. ఎస్ఐ రాఘవేందర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కోళ్ల పడకల్ ఫతేసాగర్ చెరువులో గుర్తు తెలియని పసికందు మృతదేహం నీటిపై తేలుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో పడేసిన పసికందును బయటికి తీసి పరిశీలించారు. పసికందు ఆడపిల్లగా గుర్తించారు. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆ పసికందును ఎవరు పడేశారు? ఎందుకు పడేశారు? అక్కడికి ఎలా చేరింది? అనే విషయాలపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

లైఫ్‌సైన్సెస్, మెడికల్ హబ్‌గా తెలంగాణ

- తయారీ రంగం ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం
- ప్రకృతి ఉత్తమగురువు.. నేర్చుకోవాలిగానీ తప్పుచేయొద్దు
- బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025 సదస్సులో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైఫ్ సైన్సెస్, మెడికల్ హబ్‌గా తెలంగాణ నిలిచిందని, ఇప్పుడు తయారీ రంగం ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఎఐజి ఆస్పత్రిలో జరిగిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్(ఆసియా-పసిఫిక్)-2025లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ బయోడిజైన్ ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణల సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మనం రూపొందించే దేనిలోనైనా ప్రయోజనం, పనితీరు, రూపం ప్రాథమిక అంశాలుగా ఉంటాయని, దేవుడు గొప్ప డిజైనర్..ప్రకృతి ఉత్తమ గురువు అని చెప్పారు. ప్రకృతి నుంచి నేర్చుకోవాలిగానీ తప్పులు చేయొద్దని సూచించారు. కృత్రిమ మెదడును సృష్టించడానికి సహజ మెదడును ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రైజింగ్-2047లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్‌కు కేంద్రంగా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలకమైనవని తెలిపారు. ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ వంటివి హైదరాబాద్‌లో అత్యంత కీలకమైనవన్నారు. తయారీ రంగం నుంచి ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను మారుస్తున్నామని చెప్పారు. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశామని, అందులో పరిశోధన, పరీక్ష, తయారీ కోసం ఉత్తమ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామని వివరించారు. అక్కడ 60కి పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. డయాగ్నోస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. స్థానిక స్టార్టప్‌లు, ఎమ్ఎస్ఎమ్ఇలు గ్లోబల్ కంపెనీలతో పాటు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఎఐజి ఆస్పత్రి బృందాన్ని అభినందించారు. డేటా గోప్యతను పాటిస్తూనే ఇక్కడ ప్రజల వైద్యసహాయం కోసం అవసరమైన డేటాను అందజేస్తామని ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ, కార్పొరేషన్లు, విద్యా సంస్థలు, రీసెర్చ్ సెంటర్లతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయనీ, పన్నులు, యుద్ధాలు, వాణిజ్యపరమైన అడ్డంకులు వంటివి ఎదురవుతున్నాయని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పై సిఎంతో చర్చిస్తా

- మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ సమస్యలను సిఎంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధిలో ఎస్‌టియు కీలక పాత్ర పోషించిందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను ప్రభుత్వం దశల వారీగా చెల్లిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ఉపాధ్యాయ సంక్షేమానికి పర్వత్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే ఏర్పడి, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు అని అన్నారు. రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన, అప్రెంటిస్ విధానం రద్దు కొరకు పోరాడారని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆ సంఘం సంఘ చరిత్రను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుదల కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ కె. లింగయ్య, ఆర్‌జెడి సత్యనారాయణ, సంఘ రాష్ట్ర నాయకులు ఆట సదయ్య, ఎల్. ఎం. ప్రసాద్, జుట్టు గజేందర్, ఎవి సుధాకర్, రవి, నర్సింహారెడ్డి, శంకర్ మాతంగి, పోల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కృష్ణారెడ్డి, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

యూరియా కొరత ఇప్పుడే ఎందుకొచ్చింది?

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- వాస్తవాలను పక్కదారి పట్టించేలా మాట్లాడటం సరికాదు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదకొండేండ్లలో రాష్ట్రానికి లేని యూరియా కొరత ఇప్పుడెందుకొచ్చిందంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర రైతాంగానికి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాస్తవ పరిస్థితులను పక్కదారి పట్టేలా మాట్లాడం సరైందికాదని మంత్రి ఒక ప్రకటనలో హితవుల పలికారు. యూరియా కొరతపై వాస్తవాలను దాచి ఉల్టా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎర్ర సముద్రంలో నౌకాయనం నిలిచిపోవడం వల్ల యూరియా దిగుమతికి అంతరాయం ఏర్పడిదంటూ చెబుతూనే... మరోవైపు రాష్ట్ర ప్రభుత్వమే కారణమంటూ విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేలా ఆయన వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగదని హితవు పలికారు. రైతులను వెంటాడుతున్న యూరియా కష్టాలను తీర్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ అలసత్వం వల్ల ఏర్పడిన యూరియా కొరతపై కిషన్‌రెడ్డి వాస్తవాలను దాచి పెట్టి తమపై రాజకీయ ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఈ వానాకాలానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని తెలిపారు. ఆగస్టు 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సిన ఉండగా, ఇప్పటివరకు 5.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2.64 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి అందలేదని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్రానికి యాభై వేల టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

సురవరం భౌతిక కాయానికి ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లోని ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. చివరి వరకు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నేతగా ప్రజాపక్షం వహించారని కొనియాడారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎంవి.రమణ. శాసనం మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం.నరెందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, గోరటి వెంకన్న ఆయన పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ మంత్రులు కె.జానారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పువ్వాడ అజయ్‌కుమార్, నిరంజ్‌రెడ్డి, మాజీ ఎంపీలు బి.వినోద్‌కుమార్, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పౌర హక్కుల నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, టీజేఎస్ నేత కోదండరామ్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ మొలుగూరి కుమార్, సినీ ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, ఆర్.నారాయణమూర్తి, ప్రముఖ పాత్రికేయులు రామచంద్రమూర్తి, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు సురవరానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రమాదంలో 'మంజీర' బ్యారేజి



- వరద ఎక్కువ రావడంతో గేట్లు తెరిచేందుకు యత్నం
- గేట్లకు రిపేర్లు చేసి నీటిని విడుదల చేశాం : సంగారెడ్డి తహసీల్దార్ బలరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదిహేను రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు సింగూరు ప్రాజెక్టుకు వరద పెరగడంతో దిగువకు నీటిని విడుదల చేయగా.. ఆ వరదనీరంతా మంజీర బ్యారేజీకి చేరుకున్నాయి. సంగారెడ్డి మండలం కలబ్‌గుర్ గ్రామంలోని మంజీర బ్యారేజీకి వరద పోటెత్తడంతో గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసేందుకు అధికారులు యత్నించారు. ఈ క్రమంలో 2,7,8 బ్యారేజీ గేట్లు తెరుచుకోలేదు. కాగా గేట్లు ఓపెన్ కాకపోవడంతో మంజీరా బ్యారేజ్ గేట్లపై నుంచి వరద నీరు ఎగిసిపడుతున్నది. దాంతో బ్యారేజి సిబ్బంది హైదరాబాద్‌లోని హెచ్ఎండిఎ ఇంజనీర్లకు సమాచారం అందించారు. మంజీరా బ్యారేజీకి చేరుకున్న ఇంజనీర్లు గేట్లను పరిశీలించారు. కాగా, రాష్ట్రంలోని ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా 2025 మార్చి 22వ తేదీన మంజీర బ్యారేజిని జాతీయ ఆనకట్టల భద్రతా చట్టం-2021 ప్రకారం ఏర్పాటైన ఎస్డీఎస్ఓ ఆధ్వర్యంలో నిపుణుల బృందం పరిశీలించింది. బ్యారేజి నిర్వహణ, పర్యవేక్షణ లోపాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లర్లకు (పియర్ల)కు పగుళ్లు వచ్చాయని గుర్తించింది. వాటిని రిపేర్లు చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ ఆచరణకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో భారీ వర్షాల వల్ల వరదలు పెరగడంతో నీటి ప్రవాహానికి గేట్లు తెరుచుకోకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. గతేడాది గేట్లు ఓపెన్ చేసే సమయంలో కూడా గేట్లు మొరాయించాయి. తెరిచిన గేట్లను మూసేటప్పుడు కూడా ఇబ్బందులు తప్పవని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్యారేజికి హైదరాబాద్ నుంచి ఇంజనీర్లను రప్పించగా వారు బ్యారేజ్ గేట్లను పరిశీలిస్తున్నారు. మంజీర బ్యారేజికి ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు తేరుకుని బ్యారేజీకి రిపేర్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గేట్లను ఓపెన్ చేశాం : సంగారెడ్డి తహసీల్దార్ బలరాం

మంజీర బ్యారేజి గేట్లు తెరుచుకోకపోవడంతో హైదరాబాద్ నుంచి ఇంజనీర్లను రప్పించాం. వారి సహకారంతో గేట్లను ఓపెన్ చేసి నీటిని దిగువకు వదులుతున్నాం. ముఖ్యంగా 2, 7, 8 గేట్లు మొరాయించాయి. వాటికి రిపేర్ చేసి 1.5 మీటర్ల ఎత్తుకు గేట్లను లేపి 13,333 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నాం. ప్రస్తుతానికి ఎలాంటి అంతరాయం లేదు.

సూటిపోటి మాటలు... వేధింపులు...

- తీవ్ర మానసిక ఒత్తిడిలో ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏయ్ ఆశా.. ఇటురా.. ఫొటో తీయ్.. బుద్ధుందా..? లిప్‌స్టిక్ ఎందుకు? చెంపలకు గంధం ఎవడికోసం పెట్టుకున్నారు? చేతులకు గాజులు ఎందుకు వేసుకుంటున్నారు.? వేసుకోవద్దు' ఇలా కొంతమంది వైద్యాధికారులు ఆశాలతో వ్యవహరిస్తున్న తీరు. సూటిపోటి మాటలతో ఆశాలకు నిత్యం చీవాట్లు, ఛీత్కారాలు తప్పడం లేదు. జాబ్‌చార్ట్‌కు మించి పనులు చేస్తున్నా.. వారికి వేధింపులు నిత్యకృత్యం అయ్యాయి. బాడీ షేమింగ్ చేస్తున్నారని ఆశాలు ఆవేదన చెందుతున్నారు. లోలోపల కుమిలిపోతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. 'ప్రజాశక్తి'కి పలువురు తమ కష్టాలు వివరించారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,230 మంది ఆశాలు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు వీలుగా మాతాశిశురక్షణలో భాగంగా ఆశాలను నియమించారు. పిహెచ్‌సి, యుహెచ్‌సి పరిధిలో గర్భిణుల నమోదు, పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించేలా పర్యవేక్షిస్తూ ఆ వివరాలను ఎప్పటికప్పుడూ సెంటర్‌కు, ఉన్నతాధికారులకు చేరవేస్తుంటారు. ఆరోగ్య సర్వేలు, టిబి సర్వే, డెంగ్యూ, బోధకాలు, మలేరియా, కేన్సర్ ఏ వ్యాధి వచ్చినా ఆశాలే ముందుండి కార్యక్రమాలు చేస్తున్నారు. ఇంత చేస్తున్నా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లేవు. కానీ,మానసికంగా వేధిస్తున్నారని వాపోతున్నారు.

కక్ష సాధింపు ధోరణి

టిబి టెస్టు కోసం స్రృటం సేకరించి.. ఆ బాక్సులను ఆశాలే టెస్టు కోసం గతంలో ఆస్పత్రికి తీసుకెళ్లేవారు. సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేయడంతో ఆ బాధ్యత నుంచి వారిని తప్పిస్తూ జీవో జారీ అయింది. అప్పటి నుంచి తమపై పలువురు వైద్యాధికారులు కక్ష పెంచుకున్నట్టు ఆశాలు అంటున్నారు. ఆ తర్వాత నుంచి టిబి క్యాంపుల వద్ద డ్యూటీలు వేస్తున్నారు. ఒక్కొక్క ఆశా కనీసం 300 మంది టిబి రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వారికి బిపి, షుగర్, ఇతర రోగాలు ఏమైనా ఉన్నాయా అనేది నమోదు చేయాలి.

అర్ధరాత్రి.. అపరాత్రి అని లేదు

ఎక్కడ డెంగ్యూ కేసు నమోదైనా.. అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా ఫాగింగ్ చేసేందుకు మున్సిపల్ అధికారులతో, సిబ్బందితో కలిసి ఆశాలు సైతం వెళ్లాల్సిందే. రాత్రి 9 గంటలకు వెళ్లి తెల్లవారుజామున ఎప్పుడో ఇంటికి చేరుతుండటంతో చుట్టుపక్కల వారితో మాటలు పడాల్సి వస్తోంది. ఒక్క డెంగ్యూ కేసు నమోదయితే చుట్టుపక్కల వంద ఇండ్లను సర్వే చేసి వివరాలన్నీ ఆశాలే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

సూటిపోటి మాటలతో వేధింపులు

క్షేత్రస్థాయిలో ఉండి కష్టపడి పని చేస్తున్నా.. అధికారులు సూటిపోటి మాటలతో వేధింపులకు గురి చేస్తున్నట్టు పలువురు ఆశాలు వేదన చెందుతున్నారు. డ్యూటీలో లిప్‌స్టిక్ పెట్టుకుంటారా..? గాజులు ఎందుకు వేసుకున్నారని అడుగుతున్నారని.. తాము పనిచేసే గల్లీవాసుల ముందే అలా వేధిస్తుండటంతో ఒక్కోసారి ఏడుపు వస్తోందంటున్నారు. మీటింగ్‌కు ఐదు, పది నిమిషాలు ఆలస్యంగా వస్తే.. మీకోసం బైక్ పంపాలా..? అంటూ వెక్కిరింతలు షరామాములు. తమ పనిలో ఏమైనా లోపాలుంటే చెప్పాల్సింది పోయి.. అందుకు విరుద్ధంగా పర్సనల్ విషయాలపై మాట్లాడటాన్ని తట్టుకోలేకపోతున్నారు.

కనీస సౌకర్యాలుండవు

సిహెచ్.నర్స్, ఆశా వర్కర్

తప్పులు చేస్తే నమోదు చేసేందుకు ఆశాలకు కంప్లైంట్ రికార్డు పెట్టారు. కానీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేవు. పిహెచ్‌సి, యుహెచ్‌సిల్లో బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు అవకాశం లేదు. నీళ్లు లేవు. అడిగితే నిధులు లేవు అంటారు. ఎలా డ్యూటీలు చేయాలి.. మీటింగ్‌లకు ఎలా రావాలి.. ఎప్పుడైనా 10 నిమిషాలు లేట్ అయితే బైక్‌లు పంపాలా అని వెటకారం. 9 గంటలకే టైమ్ స్కాన్ ఫొటో పెట్టాలి. సన్మానాలు అవార్డులు వద్దు.. మర్యాద ఇవ్వండి.

మేము పనిచేస్తేనే రిపోర్ట్ : శోభ- ఆశావర్కర్

లిప్‌స్టిక్ పెట్టుకోవద్దు. గాజులు వేసుకోవద్దు అంటూ టార్చర్ పెడుతున్నారు. అధికారులు చెప్పే పనులన్నీ చేస్తున్నాం.. అయినా మానసిక వేధింపులు. మేము అన్నీ బంద్ చేసి కూర్చుంటే ఎలాంటి రిపోర్ట్ రాదు. మా పనిని చూడండి. లార్వా కిట్టు చూడండి. గోడ మీద రాసే రిపోర్ట్ చూడండి.. కానీ పర్సనల్ విషయాలు ఎందుకు చూస్తున్నారు..? డ్యూటీలో తప్పుంటే ప్రశ్నించండి. సూటిపోటి మాటలదో వేధించొద్దు.

ఆశాలపై వేధింపులు అరికట్టాలినూర్జహాన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్

ఆశాలపై వైద్యాధికారుల వేధింపులు అరికట్టాలి. ఆశాల సమస్యలపై డిఎంఅండ్‌హెచ్‌ను కలిస్తే ఆమె సైతం డ్యూటీ సమయంలో లోపల అడుగుపెట్టొద్దు అంటూ దబాయిస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయాల్సింది పోయి అందుకు విరుద్ధంగా డిఎంఅండ్‌హెచ్ఓ సైతం అధికారులకు వంతపాడుతూ ఆశాలను వేధించడం తగదు.

మనోధైర్యాన్ని పెంచడంలో క్రీడలది కీలక పాత్ర

- సంజయ్ కుమార్ శ్రీవాస్తవ
- ఆలిండియా రైల్వే బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిబ్బందిలో మనోధైర్యాన్ని పెంచడానికి, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న 72వ ఆలిండియా ఆలిండియా రైల్వే బ్యాడ్మింటన్ (మెన్-ఉమెన్) ఛాంపియన్‌షిప్-2025-26 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అన్ని రైల్వే జోన్‌ల నుంచి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు పురుషులు, మహిళలు, వెటరన్స్‌కు నిర్వహించారు. పురుషుల టీమ్ ఛాంపియన్‌షిప్ విజేతగా సౌత్ ఈస్టర్న్ రైల్వేబి, రన్నరప్‌గా నార్త్ ఈస్టర్న్ రైల్వే, మూడోస్థానంలో నార్తర్న్ రైల్వే జోన్ల టీమ్‌లు నిలిచాయి. మహిళల టీమ్ ఛాంపియన్‌షిప్ విజేతగా వెస్ట్ సెంట్రల్ రైల్వేబి, రన్నరప్‌గా నార్త్ ఈస్టర్న్ రైల్వే, మూడోస్థానంలో నార్త్ వెస్ట్రన్ రైల్వే జోన్ల జట్లు నిలిచాయి. వెటరన్ విభాగంలో సెంట్రల్ రైల్వే నుంచి సంజీత్ ప్రతాన్ -యోగేష్ జోడి విజేతగా నిలిచింది. రన్నరప్ బహుమతిని లలిత్ కుమార్ - ప్రవీణ్ కుమార్(రైల్వే బోర్డుటీమ్) జోడి గెలుపొందింది.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- కామారెడ్డి జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కామారెడ్డి పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 5వ మహాసభను కామారెడ్డిలోని బతుకమ్మగుంటలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన, ఆరోగ్యం బాగా లేక విధుల్లో లేని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో కార్మికుల కోసం ఆస్పత్రిని నిర్మించాలని, కార్మికులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని, పిఎఫ్ డబ్బులను సక్రమంగా కార్మికుల అకౌంట్‌లో జమచేయాలని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం కోసం ఎంతటి పోరాటాలకైనా కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి.రమ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్, సిఐటియు కామారెడ్డి జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



వరంగల్‌లో రెయిన్ బో పిల్లల ఆసుపత్రి

- ప్రశాంతి హాస్పిటల్‌లో సేవలు ప్రారంభం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

రెయిన్ బో ఆస్పత్రి విస్తరణలో భాగంగా వరంగల్ పట్టణంలో 20వ ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించారు..దశాబ్ద కాలంగా వరంగల్ నగరంలో నమ్మకమైన వైద్య సేవలను అందిస్తున్న ప్రశాంతి హాస్పిటల్ వేదికగా సంయుక్త భాగస్వామ్యంగా రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఈ నూతన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పీడియాట్రిక్ కేర్ కోసం రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ గా అప్ గ్రేడ్ చేశారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ.., " అధునాతన సాంకేతికత, నైపుణ్యాన్ని జోడించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి నిబద్ధత తో సేవ చేస్తున్నామని తెలిపారు.

డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి మచ్చా మాట్లాడుతూ.,

ప్రశాంతి హాస్పిటల్ ఎల్లప్పుడూ మహిళలు, పిల్లల సంరక్షణలో అత్యున్నత ప్రమాణాలకు కట్టుబడి ఉంది అన్నారు. రెయిన్ బో తో కలిసి అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

భారత్‌పై అమెరికా పెత్తనమేంటి?

- దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్న మోడీ : ఎస్.వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్‌పై అమెరికా పెత్తనమేంటని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య ప్రశ్నించారు. దేశ సార్వభౌమత్వాన్ని ప్రధాని మోడీ అమెరికాకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. అమెరికా విధిస్తున్న సుంకాల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సార్వబౌమాత్వాన్ని ట్రంప్ అగౌరవపరుస్తుంటే మోడీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని వికలాంగుల వాయిస్ మాస పత్రిక 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పత్రిక ఎడిటర్ ఎం.అడివయ్య అధ్యక్షతన 'ట్రంప్ దుందుడుకు వైఖరి - ప్రపంచ దేశాలపై ప్రభావం' అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో వీరయ్య మాట్లాడారు. భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులపై 25 శాతం సుంకాలు, 25 శాతం జరిమానా విధిస్తామంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. దేశ ప్రజలు, దేశ ప్రతిష్ట కంటే మోడీకి ట్రంపే ఎక్కువా? అని నిలదీశారు. ప్రపంచ దేశాలు అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తుంటే ప్రధాని మోడీ మాత్రం ఆ దేశానికి ఊడిగం చేస్తున్నార ని విమర్శించారు. అమెరికా విధిస్తున్న సుంకాలతో దేశంలో వస్త్ర పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తులు, డెయిరీ, ఫార్మా రంగాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.

శ్రమను గౌరవించే దేశాల్లోనే అభివృద్ధి

- మహిళలు ఉత్పత్తిలో పాల్గొన్నప్పుడే నిజమైన అభివృద్ధి : బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రమను గౌరవించే సంస్కృతి ఉన్న దేశాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) 40వ వార్షికోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం సభలో సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ప్రయివేట్ పరిశ్రమలో ఒకే నాయకత్వంలో నిరంతరాయంగా 40 సంవత్సరాల పాటు ఐక్యంగా కొనసాగడం అభినందనీయమన్నారు. సీఐటీయూ సిద్ధాంతాలకు లోబడి మొదటి నుంచి కార్మికులను రాజకీయ చైతన్యం చేసుకుంటూ ప్రజాతంత్ర పనివిధానం ద్వారా శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అనేక అద్భుత విజయాలను సాధించిందని తెలిపారు. కేవలం తమ జీతభత్యాల కోసమే కాకుండా సామాజిక, సంఘీభావ కార్యక్రమాల్లో సైతం చురుకుగా పాల్గొంటూ.. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. శ్రమను గౌరవించే దేశాలు అభివృద్ధి సాధించాయని, మనదేశ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఉత్పత్తిలో భాగస్వాములైతేనే నిజమైన అభివృద్ధి సాధించినట్టు అవుతుందని అన్నారు. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం ఇటీవల అడ్డగోలుగా పెంచిన పన్ను టారిఫ్‌ల వల్ల ఎగుమతులపై ఆధారపడిన పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా చైతన్యవంతులైన శాండ్విక్ కార్మికులు మరింత ఐక్యంగా ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

4 దశాబ్దాల పాటు కార్మికుల్లో ఐక్యత : శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు

కార్మిక సంక్షేమంలో రాజీలేకుండా 4 దశాబ్దాల పాటు కార్మికులను ఐక్యంగా నిలబెట్టుకుని, 14 వేతన ఒప్పందాల ద్వారా అత్యధిక వేతనాలు, సౌకర్యాలు సాధించామని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. కార్మికుల గృహవసతి, మెడికల్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ సంవత్సరానికి 21 రోజులకు పెంచుకోవడం, రిటైర్మెంట్ వయసు 60 సంవత్సరాలకు పెంచడం లాంటి అనేక హామీలను.. కార్మికుల ఐక్య పోరాటాల ద్వారా సాధించామన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమల్లో సీఐటీయూ యూనియన్లు ఏర్పడటానికి శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయాలు తోడ్పాటును అందించాయని తెలిపారు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను కుటుంబ సభ్యుల వరకు విస్తరించడం శాండ్విక్ యూనియన్ ప్రత్యేకతగా అభివర్ణించారు. కుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో కార్మిక కుటుంబాలు అత్యధిక సంఖ్యలో కదిలి రావడం 40 సంవత్సరాల యూనియన్ కృషికి నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఐక్యంగా.. మరిన్ని విజయాలు సాధించి తమ ప్రయాణం గోల్డెన్ జూబ్లీ వైపు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్మిక కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం అత్యంత ఉత్సాహభరితంగా, ఆనందోత్సవాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పి.పాండురంగారెడ్డి, ఎం.మనోహర్, ఏవీ రావు, సదాశివరెడ్డి, సత్తిబాబు, కమిటీ సభ్యులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హక్కుల కోసం సమరశీల పోరాటాలు

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి


మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీల హక్కుల సాధన కోసం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని పిఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అంగన్‌వాడీ యూనియన్ జిల్లా 5వ మహాసభలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందన్నారు. ప్రమాదకరమైన విధానాలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సిఫార్సులను అమలు చేస్తుందని విమర్శించారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడానికి ఈ నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గకరమన్నారు. ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీ ఇంగ్లీష్ మీడియం విద్య పేరుతో ఆరు సంవత్సరాల్లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించడం సరైంది కాదన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని ప్రీ ప్రైమరీ పిఎం శ్రీవిద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యా బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్స్‌కి, హెల్పర్స్‌కు ఇవ్వాలని, వాలంటీర్లకిచ్చే అదనపు వేతనం అంగన్‌వాడీ టీచర్లకు ఇవ్వాలన్నారు. టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అంగన్వాడీ ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వం పెంచిన వయోపరిమితిని 60 సంవత్సరాలకు కుదించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు, మట్టి ఖర్చులకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఫ్, ఇఎస్ఐతో పాటు ప్రమాద బీమా రూ.20 లక్షలు ఇవ్వాలని, అర్హులైన ఆయాలను టీచర్స్‌గా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు పి.మంగ, శశికళ, కోశాధికారి ఏసుమణి, నాయకులు అరుణ, విజయ, ఇందిర, యేసుమని, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల వితరణ ఉద్యమశీలి పురాణపండ శ్రీనివాస్ : ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

ప్రతి వేడుక పండుగ సందర్భంగా పురాణపండ శ్రీనివాస్ వెలువరిస్తున్న గ్రంథాలు ఎంతో విజ్ఞానం కలిగి భారతీయ మహర్షులు వేద ఉపనిషత్‌ల సారంతో ఉంటాయని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీనివాస్ ఆధ్యాత్మిక గ్రంథ వితరణ ఉద్యమశీలి అని ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదికపై పురాణపండ శ్రీనివాస్ రచించిన నిను ప్రార్థన చేసేద గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాబోయే వినాయక చవితి సందర్భంగా శ్రీనివాస్ గణేశ పూజ విధానం వ్రత కథనం వంటి అంశాలు అందరికీ గ్రంథ రూపంలో ఉచితంగా అందిస్తున్నారు అని అభినందించారు.

సామాజిక న్యాయం లక్ష్యం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రజలను అణచివేసి, అభివృద్ధికి దూరం చేసేది ఒక రకమైన రాజనీతి అయితే, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేసేది మరో రకమైన రాజనీతి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండో రకమైన రాజనీతిని అనుసరిస్తోందని, యుపిఎ హయాంలోనే దేశంలో సామాజిక న్యాయం వెల్లివిరిసిందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించిన జనహిత పాదయాత్రలో నటరాజన్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, బలహీన వర్గాల బలోపేతం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఏ రకంగా అందుతున్నాయో తెలుసుకోవడానికే పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రభుత్వాల హయాంలో ఉపాధి హామీ చట్టం వంటి పథకాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమ హక్కుల కోసం పోరాడాలని, ఆ హక్కులకు రక్షణ కల్పించడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని తెలిపారు. రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేసిన పాదయాత్రలో ప్రతి గ్రామాన్నీ ఆయన సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఉచిత విద్యుత్, ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని గుర్తుచేశారు. దేశంలోనే మెజారిటీగా ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు.

దేవుని పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లు బిజెపి వాళ్లు : టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ జనహిత పాదయాత్రలో బిజెపిపై పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. దేవుని పేరుతో ఓట్లు అడిగే బిజెపి వాళ్లను 'బిచ్చగాళ్లు'గా ఆయన అభివర్ణించారు. మతం, కులం పేరుతో బిజెపి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన పనులను చెప్పి ఓట్లు అడుగుతామని తెలిపారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి ఎంపి బండి సంజయ్‌కి మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు లాంటి బిజెపి పెద్దలకు భయపడి బండి సంజయ్ బిసిల గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ హామీని నెరవేరుస్తామని తెలిపారు. 'నీ రక్తంలో బిసి రక్తం ఉంటే, బిసి రిజర్వేషన్లపై మాట్లాడు. మీకు దమ్ముంటే ప్రధాని మోడీ దగ్గరికి వెళ్లి మాట్లాడు' అని బండి సంజయ్‌ని ఉద్దేశించి అన్నారు. కెసిఆర్, ఆయన కుటుంబం చేసిన అవినీతి అక్రమాలకు కచ్చితంగా శిక్ష అనుభవించక తప్పదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కెసిఆర్ కూడా జైలుకు వెళ్లక తప్పదన్నారు. ఈ పాదయాత్రలో మంత్రులు పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్ కుమార్, చొప్పదండి, వేములవాడ, రామగుండం ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, మక్కాన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, జీవన్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు ప్రజలు పాల్గొన్నారు.


జనహిత పాదయాత్రలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

ఆ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి.. మళ్లీ గెలవాలి

- హైడ్రా అరాచకాలతో హైదరాబాద్ వృద్ధి అతలాకుతలం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, దమ్ముంటే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో వాళ్లు కెసిఆర్ ద్వారా గెలిచారు తప్పా వారి సొంతంగా గెలిచింది ఏమీ లేదని తెలిపారు. శేరిలింగంపల్లితో పాటు పార్టీ మారిన మిగతా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రజల కోసం కాకుండా, తమ సొంత లాభం కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లారని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి తన 20 నెలల పాలనలో తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని మియాపూర్ డివిజన్‌లోని నరేన్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు మోసం చేసినా, కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకున్నారని ప్రశంసించారు. కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే హైడ్రా పని చేస్తోందని ఆరోపించారు. హైడ్రా అరాచకాలతోనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలిందని అన్నారు. తమ హయాంలో హైదరాబాద్‌ను కులం, మతం, ప్రాంతం పేరు మీద రాజకీయాలు చేయకుండా, అన్నదమ్ములుగా ఏ పంచాయితీ లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి చూపించామని గుర్తు చేశారు. అందుకే 2023లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కాంగ్రెస్‌కు రాకుండా, మొత్తం గులాబీ జెండాకే నగర ప్రజలు ఓట్లేశారని అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.2 లక్షల 85 వేల కోట్ల అప్పు చేస్తే, సిఎం రేవంత్‌రెడ్డి 20 నెలల్లోనే రూ.2 లక్షల 20 వేల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. కేసీఆర్ ఆ అప్పుతో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అత్యాధునిక ఆస్పత్రులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు కట్టారని, కానీ రేవంత్ ఒక్క కొత్త బ్రిడ్జ్ కానీ, మోరీ కానీ కట్టిండా అని ప్రశ్నించారు. పార్టీని కింది స్థాయి నుంచి బలోపేతం చేసి వచ్చే కార్పొరేషన్‌తోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, కార్పొరేటర్లు రోజా రంగారావు, సింధు ఆదర్శ్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ రావు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా, సీనియర్ నాయకులు రంగారావు, వివిధ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెటిఆర్


యూరియా సరఫరా చేయకపోవడంపై రోడ్డుపై బైఠాయించిన నర్సాపూర్ ఎమ్మెల్యే

రైతన్నల కష్టాలు కాంగ్రెస్ పార్టీకి కనిపిస్తలేవా..

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆగ్రహం
- రైతులకు యూరియా సరఫరా చేయడం లేదంటూ.. నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల యూరియా కష్టాలు కాంగ్రెస్ సర్కార్‌కు కనిపిస్తలేవా అంటూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని పిఎసిఎస్ ముందు రైతులతో కలిసి నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే బైటాయించి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోవడం వల్లే రైతులకు కష్టాలొచ్చి పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పొద్దున లేచినప్పుడు యూరియా కోసం వస్తే తిండితిప్పలు లేకున్నా తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా అందించే నాథుడే లేడని, ఇన్ని కష్టాలు పడ్డాగాని యూరియా దొరుకుతుందో లేదో కూడా తెలీని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యంతోనే రైతులకు యూరియా కష్టాలు వచ్చాయని, మహిళలు చంటి పిల్లలతో వచ్చి క్యూలైన్‌లో నిలబడితే ఆధార్ కార్డుకు ఒక బస్తా యూరియా అందించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పాత రోజులు తెస్తామని ఎన్నికల ప్రచారంలో చెబితే ఏదోగొప్పగా చేస్తారనుకున్నామని, కానీ నిజంగానే పాత రోజులు తెచ్చి చెప్పులు లైన్‌లో పెట్టే దుస్థితిని తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలతోనే యూరియా సరఫరా నిలిచి పోయిందని, కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి ఎరువులు అందించి, రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని, లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ ఎంపిపి కల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్‌పిటిసి పబ్బ మహేష్ గుప్త, మాజీ వైస్ ఎంపిపి రమాకాంత్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మెన్ చంద్రాగౌడ్, జెడ్‌పి మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, ప్రధానకార్యదర్శి రాజశేఖర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో యూరియా బస్తాల సరఫరా

రైతులకు అవసరమైన యూరియా సంచులను ఆదివారం పోలీస్ పహారా మధ్య అధికారులు అందజేశారు. శివ్వంపేట పిఎసిఎస్ బ్యాంకుకు 560 బస్తాల యూరియా రావడంతో విషయం తెలుసుకున్న అన్నదాతలు ఉదయమే భారీ సంఖ్యలో వచ్చి క్యూలైన్‌లో నిల్చున్నారు. యూరియా కోసం కొంతమంది మహిళలు చిన్న పిల్లలతో వచ్చి క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి గొడవలు లేకుండా రైతులకు యూరియా బస్తాలను మండల వ్యవసాయ అధికారి లావణ్య, బ్యాంకు సిఇఒ మధు యాదవ్ పర్యవేక్షణలో అందజేశారు. ఒక్కో ఆధార్ కార్డుకు ఒక్కో సంచిని అధికారులు ఇచ్చారు. మరిన్ని లారీల యూరియా మండలానికి వస్తుందని, రైతులెవరూ దిగులు చెందొద్దని ఎఒ లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ మౌనిక, ఎఎస్ఐ సాయిలు, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి గౌడ్, కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్, కృష్ణ, ఆనంద్, శేఖర్, సుధాకర్, హరి గోపాల్,పాల్గొన్నారు.

'గాంధీ'కి సురవరం భౌతికకాయం అప్పగింత

- అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి (83) భౌతిక కాయాన్ని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీకి ఆయన కుటుంబ సభ్యులు అప్పగించారు. సుధాకర్‌రెడ్డి అంతిమ యాత్ర ఆదివారం హైదరాబాద్‌లో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూం భవన్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన అంతిమ యాత్ర.. నారాయణగూడ ఫ్లై ఓవర్ నుంచి చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్ మీదుగా ర్యాలీగా తీసుకెళ్లి గాంధీ మెడికల్ కాలేజీలోని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని అనాటమీ విభాగానికి అప్పగించారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ యాత్రలో పిఎన్ఎం కళాకారుల కోలాటం, కర్రసాము, డప్పు కళాకారుల విన్యాసాలతో స్ఫూర్తివంతంగా సాగింది. "సుధాకర్‌రెడ్డి అమర్ రహే, రెడ్ సెల్యూట్" అనే నినాదాలతో ఆ మార్గం మారు మోగింది. ఈ అంతిమ యాత్రకు అన్ని జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఎర్ర చొక్కాలు ధరించి భారీగా హాజరయ్యారు.

గొప్ప కమ్యూనిస్టు యోధుడు సుధాకర్‌రెడ్డి అని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. మెడికల్ కాలేజీ వద్ద సురవరం భౌతిక కాయానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, చెరుకు సుధాకర్ నివాళ్లర్పించారు. అనంతరం సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, అజీజ్ పాషా, తదితరులు సురవరం భౌతిక కాయాన్ని సాయంత్రం 5 గంటలకు గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఉన్నత ఆశయంతో స్పందించిన సురవరం కుటుంబ సభ్యులకు, కమ్యూనిస్టు పార్టీలకు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- మరో ఘటనలో భార్యపై కత్తితో దాడి చేసిన భర్త
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఘటనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబ కలహాలతో మహిళలపై దాడి ఘటనలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కలకలం రేపాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందగా, ఖమ్మం జిల్లాలో భార్యపై భర్త కత్తితో దాడిచేయగా, ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లిన ఘటనలు ఆదివారం వెలుగు చూశాయి. పోలీసులు, ఆయా కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలానికి చెందిన ముదిగొండ వెంకటేశ్వరరావు కూతురు లక్ష్మీ ప్రసన్న (33)కు పదేళ్ల క్రితం అదే మండలం ఖాన్‌ఖాన్ పేటకి చెందిన పూల నరేష్ బాబుతో వివాహం జరిగింది. ప్రస్తుతం వారికి మూడేళ్ల పాప ఉంది. కాగా, ఆ దంపతుల మధ్య గొడవల కారణంగా మూడేండ్ల క్రితం వారి స్వగ్రామం నుంచి అశ్వారావుపేటకి వచ్చి నరేష్ బాబు సోదరి దాసరి విజయలక్ష్మి ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న లక్ష్మి ప్రసన్న ఇంట్లో పనిచేస్తుండగా జారిపడి నుదుటికి, గవదకు గాయాలయ్యాయి. వెంటనే ఏపీలోని రాజమండ్రి కిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు. ఈ విషయాన్ని నరేష్ బాబు లక్ష్మిప్రసన్న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆమె తల్లిదండ్రులు హాస్పిటల్‌కి వెళ్లి చూడగా తమ కూతురు వెంటిలేటర్‌పై ఉండటం చూసి ఖంగుతిన్నారు. అలాగే, ఆమె ఒంటిపై మానిన గాయాలనూ గమనించారు. కాగా, ఆమె చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు భర్త నరేష్ బాబు, అతని బంధువులు మరో ఇద్దరిపై అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో మృతురాలు తండ్రి ముదిగొండ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌ఒ ఎస్ఐ యయాతి రాజు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు గ్రామంలోని బీసీ కాలనీలో ఉంటున్న చిల్ల సూర్యనారాయణ ప్రయివేట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాల నేపథ్యంలో సూర్యానారాయణ, భార్య సాయి నాగలక్ష్మి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరూ ఘర్షణపడ్డారు. తీవ్ర ఆగ్రహానికి గురైన సూర్యానారాయణ కత్తితో నాగలక్ష్మిపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితురాలు కేకలు వేసుకుంటూ ఇంట్లో నుంచి రోడ్డుపైకి వచ్చి కింద పడిపోయింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీ భార్గవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సూర్యనారాయణ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు ఉండగా ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతిగా ఉన్నట్టు సమాచారం.